నార్త్ సిటీ మెట్రో సాధనకు పోరాటం



కల్లుగీత కార్మికులకు కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్: నార్త్ సిటీ వరకు మెట్రోను సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. హైదరాబాద్ ఉత్తరం వైపు గల నార్త్ సిటీకి మెట్రోను విస్తరించాలని కోరుతూ ఈ నెల 7న ఉదయం 9 గంటలకు మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో జీడిమెట్ల విలేజ్ గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన మహా ధర్నాకు మద్దతు ఇవ్వాలని కోరుతూ మెట్రో సాధన సమితి సభ్యులు క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయనను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం జేబీఎస్ నుంచి అల్వాల్ మీదుగా తూంకుంట మార్గంతో పాటు ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి, సుచిత్ర, కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు మెట్రో రైలు విస్తరణపై సర్వే సంస్థలకు పనులను అప్పగిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని పక్కనపెట్టి ఫోర్త్ సిటీ అంటూ నూతన మార్గానికి మెట్రోను విస్తరించిదన్నారు. నిత్యం లక్షల మంది ఉద్యోగులు సుచిత్ర, కొంపల్లి, కుత్బుల్లాపూర్, ప్రాంతాల నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. మెట్రో సాధన సమితికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంపత్, జార్జి, ఓరుగంటి వెంకట్, పుప్పాల నాగరాజు, మూర్తి, రవి రావు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు కిట్ల పంపిణీ..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 24 మంది కల్లుగీత కార్మికులకు 'కాటమయ్య కిట్లను' ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ యాదయ్య, ఎస్ఐ రవి రాథోడ్, బీసీ కార్పొరేషన్ అధికారులు పీ రాజేశ్వర్, మొహిద్ ఖాన్, కమల్ దాస్, పీ శ్రీనివాస్, గౌడ సంక్షేమ సంఘం సభ్యులు నరేందర్ గౌడ్, ఏ సంతోష్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, కృష్ణాగౌడ్, సురేశ్ గౌడ్, బాలకృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా శంభీపూర్ కృష్ణ బర్త్‌డే వేడుకలు



కేసీఆర్‌తో శంభీపూర్ కృష్ణ



శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్లు

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, దుండిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ జన్మదిన వేడుకలు శనివారం శంభీపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అదే విధంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజలు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఆయనతో కలిసి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో శంభీపూర్ కృష్ణ



కేక్ కట్ చేస్తున్న శంభీపూర్ కృష్ణ

ఫేక్ డాక్యుమెంట్లు.. భూ రిజిస్ట్రేషన్లు..!

- కుత్బుల్లాపూర్‌లో హాట్ టాపిక్‌గా పద్మక్క భూకబ్జాల వ్యవహారం
- రాజకీయ నాయకుల పేర్లు చెప్పి అందినకాడికి దండుకున్న వైనం
- ఆయా స్టేషన్లలో కేసుల నమోదు



పద్మజారెడ్డి

కుత్బుల్లాపూర్: నిన్నమొన్నటి వరకు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగిన పద్మజా రెడ్డి అలియాస్ పద్మక్క ఫోర్జరీ డాక్యుమెంట్ల వ్యవహారం కుత్బుల్లాపూర్‌లో హాట్ టాపిక్ గా మారింది. వారం క్రితం మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ల్యాండ్ సెటిల్‌మెంట్ విషయంపై కొంతమంది రౌడీలతో కలిసి రామస్వామి అనే వ్యక్తిని బెదిరించగా పోలీసులు కేసు నమోదు చేసిన విషయాన్ని మరిచిపోక ముందే తాజాగా జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో 200 గజాల స్థలాన్ని ఫోర్జరీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఏళ్లుగా సుభాష్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని వివాదాస్పద స్థలాల్లో తలదూర్చి రాజకీయ నాయకుల పేర్లు చెప్పి అందినకాడికి దండుకుంటూ లక్షలు దోచుకున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆరుగురు వ్యక్తులతో కలిసి కొంతకాలంగా ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారుచేసి నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో స్థలాలను కాజేయాలని చూస్తూ పోలీసులకు చిక్కడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

సుభాష్‌నగర్‌ను అడ్డగా చేసుకుని..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సుభాష్ నగర్ ప్రాంతంలో వివాదాస్పద భూములు అధికంగా ఉండడంతో ఓ ముఠాను ఏర్పాటు చేసుకున్నది. వారితో కలిసి వివాదాస్పద స్థలాల్లో ఎంటర్ కావడం వారిని బెదిరించడం లాంటివి చేస్తూ ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి భూముల కబ్జాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే పోలీసులు రిమాండ్‌లో ఉన్న పద్మక్కను పోలీస్ కస్టడీకి తీసుకుని విచారిస్తే మరిన్ని భూ వివాదాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్న నేపథ్యంలో పోలీసులు ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. పోలీసులు సైతం ఆమె బాధితులు నేరుగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో దేవీ శరన్నరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం అమ్మవార్లను అన్నపూర్ణదేవీగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాలు, ఆలయాల్లో జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పలుచోట్ల అన్నదానాలు చేపట్టారు. – రంగారెడ్డినగర్



దుండిగల్‌లోని శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో..



చింతల్‌లో పూజల్లో కాంగ్రెస్ నేత శ్యామ్‌గౌడ్, బాల్‌రెడ్డి



సుచిత్రలోని ప్రగతిప్రైడ్ అపార్ట్ మెంట్‌లో..



చిన్నారులకు సంప్రదాయ దుస్తులు, వస్తువులు, పంపిణీ చేస్తున్న బండి వాసవి



అన్నదానంలో పాల్గొన్న జైహింద్



గదులను కూల్చివేస్తున్న జేసీబీ



ప్రహరీ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న జేసీబీ

మద్దాలకుంట చెరువులో
ఆక్రమణల కూల్చివేత

సుమారు 5 ఎకరాల భూమి స్వాధీనం

కుత్బుల్లాపూర్: మద్దాలకుంట చెరువు పరిరక్షణకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. గాజులరామారం సర్వేనెంబర్ 335లో సుమారు 11 ఎకరాలకు పైగా చెరువు ఉంది. అయితే కొంతకాలంగా ఇక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై గత నెల 30న 'మద్దాలకుంటను మింగేస్తున్నారు' అన్న కథనం 'సాక్షి'లో ప్రచురితం కాగా జిల్లా ఇరిగేషన్ అధికారులు నరేందర్, రామారావుతో పాటు రెవెన్యూ అధికారి గులాం కలీం, సర్వేయర్ జ్యోతి ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం అక్రమ నిర్మాణాలను కూల్చివేసి సుమారు ఐదు ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒకరు మూడు ఎకరాలు ఆక్రమించి కాంపౌండ్ వాల్ నిర్మించగా



సెప్టెంబర్ 30 న 'సాక్షి'లో వచ్చిన కథనం

పూర్తిగా నేలమట్టం చేశారు. అలాగే రెండు గదులు, రెండు బేస్‌మెంట్లను తొలగించారు.

సాక్షి ఎఫెక్ట్..

పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని సర్వే చేసి వారం రోజుల్లో స్వాధీనం చేసుకుంటామని, గతంలో ఇరిగేషన్ శాఖ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగానే 11 ఎకరాలకు పైగా స్థలం పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు రెవెన్యూ అధికారి గులాం కలీం తెలిపారు. మరో రెండు నిర్మాణాలు కూల్చివేయాల్సి ఉండగా వారి అభ్యర్థనతో వారం రోజుల తర్వాత తొలగిస్తామని చెప్పారు. సుమారు రూ. 100 కోట్ల విలువైన ఈ స్థలాన్ని గతంలో సర్వేల పేరుతో మాయం చేసే పనిలో ఉన్న అక్రమార్కుల గుండెల్లో ఈ కూల్చివేతలు గుబులు పుట్టించాయి. ఓ హైడ్రా దూకుడు పెంచుతుండగా.. మరోవైపు కబ్జాదారులు రెచ్చిపోతూ ఇలా అడ్డంగా బుక్ అయిపోతున్నారు.

ఆలయాల ప్రాంగణంలో అన్నదానం

జగద్గిరిగుట్ట: చింతల్ శ్రీసాయికాలనీలోని అభయాంజనేయ, పోచమ్మ ఆలయాల ప్రాంగణంలో శనివారం అన్నదానాలు నిర్వహించారు. హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ చైర్మన్ కన్నె కంటి లక్ష్మణ్, ప్రెసిడెంట్ కల్యాణ్ రావు పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతులు



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌కు సమస్యను విన్నవిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్‌ను శనివారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను వివరిస్తూ వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన శ్రీశైలంగౌడ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అదేవిధంగా పలువురు శుభకార్యాలకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.


కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు



నియామక పత్రం అందుకుంటున్న విజయ్‌కుమార్

జీడిమెట్ల: పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి దయాకర్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా బీజేవైఎం కార్యవర్గ సభ్యుడిగా నియామకమైన సుభాష్‌నగర్‌కు చెందిన మోత్కూర్ విజయ్‌కుమార్‌కు శనివారం పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ తన నియామకంపై బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, డివిజన్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

అవయవదానంతో మరొకరికి పునర్జన్మ



విజయలక్ష్మి

నిజాంపేట్: అవయవదానంతో మరొకరికి పునర్జన్మ ఇచ్చినట్లు అవుతుందని బాచుపల్లి మమత మెడికల్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ అన్నారు. మదీనాగూడకు చెందిన సంఘమనేని హనుమంతరావు సతీమణి విజయలక్ష్మి అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు బాచుపల్లిలోని మమత మెడికల్ సైన్స్ కళాశాలకు ఆమె శరీరాన్ని అప్పగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ప్రయోగాత్మకంగా శిక్షణపొందేందుకు ఉపయోగపడేలా మృతదేహాన్ని కుటుంబ సభ్యులను దానం చేయడం అభినందనీయమన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వెంకటస్వామికి ఘన నివాళి



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ శ్రీశైలంయాదవ్, కమిషనర్ శ్రీహరి

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టలో మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకురాలు గూడ వరమ్మ ఆధ్వర్యంలో మాజీ కేంద్రమంత్రి వెంకటస్వామి 95వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ హాజరై మాట్లాడుతూ హైదరాబాద్‌కు వలస వచ్చిన లక్షలాది మంది నిరుపేదలకు అండగా నిలిచి గుడిసెలు వేయించారన్నారు. అనంతరం కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఏం జనార్దన్, బండి యాదగిరి, మంగ తిరుపతమ్మ పాల్గొన్నారు.

కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో..

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో వెంకటస్వామి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, మేనేజర్ వెంకటేశం, సీనియర్ అసిస్టెంట్ ఎస్.రాజు, కో.ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు నిధులు మంజూరుకు కృషి చేయాలి



సన్న శ్రీశైలం యాదవ్

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో బీజేపీ నాయకులు రాజకీయాలు చేయకుండా నిధుల మంజురుకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగున్నరేళ్లలో మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి అవసరాలు కల్పించామని, రానున్న రోజుల్లో సైతం అదేవిధంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

నిధులు మంజూరు..

కొంపల్లి సినీ ప్లానెట్ నుంచి వివిధ కాలనీలకు వెళ్లే రోడ్డు విషయంలో ఇప్పటికే కౌన్సిల్ సమావేశంలో డ్రైనేజీ, బీటీ రోడ్డు, స్ట్రీట్ లైట్లు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి టెక్నికల్ మంజూరు కోసం పంపించామని శ్రీశైలం యాదవ్ పేర్కొన్నారు. ముందుగా రూ.90 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేపడుతామని అనంతరం రూ. కోటి నిధులతో బీటీ రోడ్డు వేసామని, అలాగే రూ. 70 లక్షలతో ఇరువైపులా స్ట్రీట్ లైట్లు అమర్చుతామని తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసిన పనులపై కూడా కనీస అవగాహన లేకుండా బీజేపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎంపీ ఈటల రాజేందర్‌తో మాట్లాడి కొంపల్లి మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు తీసుకురావాల్సిన వారు చిన్న చిన్న సమస్యలను పెద్దగా చేస్తూ ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని కోరారు.

బైక్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి రిమాండ్

నిజాంపేట్: బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులతో పాటు ఓ మైనర్‌ను బాచుపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ బండారి లేఅవుట్‌కు చెందిన పామర్తి హిమాన్ష్ (19), బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన అనిల్ (19) డిగ్రీ చదువుతున్నారు. జల్సాలకు అలవాటు పడిన వీరు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో విలువైన బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతూ వస్తుండగా వీరికి ఓ మైనర్ సహకరిస్తున్నాడు. బాచుపల్లి, ఆర్‌సీపురం, కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేటీఎం, ఆర్–15 వంటి 9 విలువైన బైక్‌లను ఎత్తుకెళ్లారు. పలువురి నుంచి ఫిర్యాదులు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా సీసీ పుటేజీల ఆధారంగా చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించారు. శనివారం హిమాన్ష్, అనిల్‌తో పాటు మైనర్‌ను అదుపులోకి తీసుకున్న వారి నుంచి రూ.12 లక్షలు విలువైన 9 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు పేర్కొన్నారు. సీఐ ఉపేందర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ తిమ్మప్ప, ఏసీపీ శ్రీనివాస్‌రావును ఈ సందర్భంగా బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ అభినందించారు.

కళాశాలల్లో బతుకమ్మ సంబురాలు

కుత్బుల్లాపూర్: చింతల్ రాయల్ డిగ్రీ కళాశాలలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడిపాడుతూ సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను కొలనులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు సీహెచ్ గోవిందరెడ్డి, ఎస్. వెంకట్ రెడ్డి, జీ రమేశ్ బాబు, కే రామకృష్ణ, ఎస్.జై శంకర్‌గౌడ్, ప్రిన్సిపాల్ మేనకా పాటిల్ అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

చింతల్ భాగ్యరథి డిగ్రీ కళాశాలలో..

చింతల్: చింతల్ భాగ్యరథి డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. విద్యార్థినులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. వేడుకల్లో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ నల్ల జయశంకర్ గౌడ్, ప్రిన్సిపాల్, డైరెక్టర్ చల్లా గోవిందరెడ్డితో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.



దుండిగల్ ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో కళాశాల కోశాధికారి మమతరెడ్డి



భాగ్యరథి డిగ్రీ కళాశాలలో ..



బతుకమ్మ వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థినులు

నేడు ధర్నా

కుత్బుల్లాపూర్: మెట్రో రైల్ కనెక్టివిటీ విషయంలో ఉత్తర హైదరాబాద్‌కు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఈ నెల 6న (నేడు) జీడిమెట్లలోని గాంధీ విగ్రహం వద్ద శాంతియుత ధర్నా నిర్వహించనున్నట్లు మేడ్చల్ సాధన సమితి సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నగరం మొత్తం మెట్రో సేవలు పొందుతుండగా, సుచిత్ర, కొంపల్లి, మేడ్చల్, కార్ఖానా, తిరుమలగిరి, అల్వాల్, శామీర్‌పేట్ వంటి కీలక జనసాంద్రత ప్రాంతాలకు మాత్రం మెట్రో సేవలు అందించకపోవడం తగదని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు చేపట్టే ధర్నాకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు వివేకానంద్ గౌడ్, మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరై తమకు మద్దతు ప్రకటిస్తారని పేర్కొన్నారు.

దేవీ శరన్నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి

కుత్బుల్లాపూర్: దేవీ శరన్నవరాత్రోత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు సూచించారు. పేట్‌బషీరాబాద్ ఏసీపీ కార్యాలయంలో మండపాలు, డీజే నిర్వాహకులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల వద్ద పాటించాల్సిన నిబంధనలు, జాగ్రత్తలను వివరించారు. మండపాల వద్ద డీజేలను ఇష్టానుసారంగా ఏర్పాటు చేసి స్థానికులకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మండపాల నిర్వాహకులు సెక్యూరిటీని నియమించాలన్నారు. సమావేశంలో సీఐ విజయవర్ధన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ కొలన్ నీలారెడ్డి

నిజాంపేట్: అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలా రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలో పెండింగ్, చేపట్టాల్సిన పనులపై సంబంధిత అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాలతో పలు చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో నిలిచిన పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, నూతన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటరీ, విద్యుత్, వాటర్‌వర్క్స్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం

నిజాంపేట్: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ ఆరోపించారు. కార్మికుల సమస్యలపై నిజాంపేట్ కార్పొరేషన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు యాదయ్య ఆధ్వర్యంలో మేనేజర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతినెలా 7వ తేదీన జీతాలు ఖాతాల్లో జమకావాల్సి ఉండగా నెలాఖరు వరకు వేయడం లేదన్నారు. అదేవిధంగా ప్రతినెలా ఇచ్చే నూనె, సబ్బులు నాణ్యతగా ఉండడం లేదని, కార్మికులకు చెప్పులు, రెయిన్ కోట్లు కూడా ఇవ్వడం లేదన్నారు.కార్మికుల చేతి వేలి ముద్రలు అరిగిపోవడంతో బయోమెట్రిక్‌లో నమోదు కావడం లేదని, పాత పద్ధతిలో హాజరు వేసేలా చూడాలని కోరారు. కార్మిక నాయకులు నర్సమ్మ, భాగ్యమ్మ, అనసూయ, వెంకన్న తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నదని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ సుభాస్‌చంద్రబోస్‌నగర్‌లో సీసీ రోడ్డు ధ్వంసమైన విషయాన్ని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడి రూ.15 లక్షల స్పెషల్ ఫండ్స్‌ను మంజూరు చేయించారు. ఇటీవల పనులు ప్రారంభం కాగా శనివారం కాలనీని సందర్శించిన హన్మంతరెడ్డిని స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, బోయిని వెంకటేశ్, బలరాం, పత్తి శ్రీనివాస్, శ్రీనివాసరావు, అజయ్, పాండు, మహేశ్, ఆజాద్ ఉన్నారు.

రోడ్డు ధ్వంసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

సుభాష్‌నగర్: ప్రభుత్వ ఖర్చులతో వేసిన సీసీ రోడ్డును ధ్వంసం చేసిన వ్యక్తిపై కాలనీవాసులు మున్సిపల్ అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుండిగల్ మున్సిపల్ బాహదూర్‌పల్లిలోని ఉదయగిరి కాలనీ రోడ్డు నెంబర్ 3లో ఓ వ్యక్తి రోడ్డు స్థలం తనది అంటూ సీసీ రోడ్డును ధ్వంసం చేశాడు. ప్రభుత్వ నిధులతో మూడేళ్ల క్రితం వేసిన రోడ్డును ఎలా ధ్వంసం చేస్తాడని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఆ దారి మూసేస్తే ఆ రోడ్డు గుండా ఒకవైపు మాత్రమే రాకపోకలు సాగించాల్సి ఉంటుందని వాపోతున్నారు. రోడ్డు ఆక్రమించిన సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

PUBLIC NOTICE

The Public in General are hereby informed that my client Sri. RAJAN KESAVAN ACHARY S/o. KESAVAN ACHARY, R/o. Flat No. 106, Pragathi Homes Infinity, Jeedimetla Village, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana State, is entered into the Agreement of Sale on 04-10-2024 with Sri. GADHIRAJU RAMA RAJU S/o. G. PRASADA RAJU & Smt. G. SURYAVATHI W/O GADHIRAJU RAMA RAJU, to purchase the Property bearing Municipal House No. 2-159/3, PTIN No. 1150600887, with a plinth area of 120.0 Sq. Feet of ACC, admeasuring 1461.26 Sq. Yards together with 338.0 Sq. Yards the extent earmarked as "MNOP", Portion for the approach road totally admeasuring 1799.26 Sq. Yards or 1504.18 Sq.Meters, in Survey No. 72, Situated at PRAPURNA ENCLAVE, JEEDIMETLA VILLAGE, Quthbullapur Mandal, Under GHMC Circle, Medchal- Malkajgiri District, Telangana State Having acquired above said property through Registered Sale Deed vide Doc. No. 2555/2012, Dt: 05-03-2012, Registered at SRO Quthbulapur & vide Doc. No. 2556/2012, Dt: 05-03-2012, Registered at SRO Quthbulapur and said property bounded by: N: Part of Sy No. 72 owned by Soni & Family, S: 46-0' Wide Road, E: House No. 2-159/4 & W: House No. 2-159/2.

Hence, anyone having any Objections towards the above said property or above said transactions shall intimate me in writing along with supporting documents within 15 days from the date of this public notice, failing which any objection raised hereafter will not be entertained and shall be considered as waived.

Date: 06-10-2024
Sd/-
K.G.V KRISHNA ADVOCATE
H: No: 5-25-482, Sri Ram Nagar, JDM-55
Ph. No.9440828846